ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 1 | పేజీలు: 10 | వెల: రూ.3/- | ఆదివారం 19 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతు

దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా

సీఎం రేవంత్ రెడ్డి

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న రేవంత్

డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు. ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు. సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు

..మిగతా 2లో

'మహిళా రిజర్వేషన్'పై డీఎంకే, కాంగ్రెస్

# విద్వేష రాజకీయాలు

విద్వేషంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ధ్వజం

ఆ సందర్భంలో ఆవేదనకు గురయ్యానని వ్యాఖ్య

కోయంబత్తూరు ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రధాని మోదీ ప్రసంగం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై విపక్షాలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ గొప్ప ప్రయత్నాన్ని డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుకున్నాయని విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్లపై డీఎంకే, కాంగ్రెస్ విద్వేషపూరిత రాజకీయాలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. విద్వేషపూరిత రాజకీయాల కోసమే మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు బిల్లును ఏప్రిల్ 16న పార్లమెంటులో డీఎంకే, కాంగ్రెస్ అడ్డుకున్నాయని ప్రధాని పేర్కొన్నారు. ఆ సందర్భం తనను తీవ్ర వేదనకు గురిచేసిందని, కోపాన్ని తెప్పించిందని ఆయన తెలిపారు. ఆనాడు కలిగిన బాధను ఇవాళ తమిళనాడు ప్రజలతో పంచుకుంటున్నానని పేర్కొన్నారు. శనివారం తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఆ ఘనతను తీసుకున్నా అభ్యంతరం లేదన్నాను!**

తమిళనాడుకు పెద్దసంఖ్యలో అదనపు సీట్లను, అన్ని రాష్ట్రాల మహిళలకు రిజర్వేషన్లను అందించే బిల్లుల ఆమోదానికి సహకరించాలని తాను వ్యక్తిగతంగా కోరినా విపక్షాలు పట్టించుకోలేదని ప్రధాని తెలిపారు. ఆ బిల్లులను ఆమోదించిన ఘనతను విపక్షమే తీసుకున్నా అభ్యంతరమేం లేదని తాను ప్రతిపక్ష పార్టీలతో చెప్పానని మోదీ పేర్కొన్నారు. సామాన్య కుటుంబాలకు చెందిన మహిళలు మరింత పెద్దసంఖ్యలో లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రాతినిధ్యాన్ని పొందాలని మాత్రమే తాను కోరుకున్నానని ఆయన చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే నారీశక్తి వందన్ అధినియం చట్టాన్ని 2023లోనే తమ ప్రభుత్వం ఆమోదించిందని, దాన్ని త్వరితగతిన అమల్లోకి తెచ్చే చారిత్రక ప్రయత్నాన్ని తాజా పార్లమెంటు సెషన్‌లో చేశామన్నారు. కానీ దురదృష్టవశాత్తు డీఎంకే, కాంగ్రెస్, వాటి మిత్రపక్షాల విద్వేషపూరిత రాజకీయాల కారణంగా ఈ గొప్ప ప్రయత్నం సఫలం కాలేదని ప్రధాని పేర్కొన్నారు.

చట్టసభల్లో సామాన్య కుటుంబాల మహిళలకు ప్రాతినిధ్యాన్ని పెంచే మార్పు గురించి డీఎంకే, కాంగ్రెస్‌లు ఎందుకంతగా కలత చెందుతున్నాయో అర్థం కావడం

..మిగతా 2లో



హర్మూజ్ జలసంధిలో

# ఇరాన్ సైన్యం కాల్పులు

వెనక్కి మళ్లిన రెండు భారత నౌకలు

జలసంధిపై తిరిగి నియంత్రణ సాధించామని ఇరాన్ ప్రకటన

అమెరికా దిగ్బంధనానికి ప్రతిచర్యగా ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడి

సుమారు 10 వాణిజ్య నౌకలు తమ మార్గాన్ని మార్చుకున్నట్లు రిపోర్ట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) బలగాలు ఒక ఆయిల్ ట్యాంకర్‌పై కాల్పులు జరపగా, రెండు భారత జెండా కలిగిన నౌకలు సహా పలు వాణిజ్య నౌకలు వెనక్కి మళ్లాయి. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ ఘటన ఒమన్‌కు 20 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం చోటుచేసుకున్నట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎంటీవో) ధృవీకరించింది. తమ కథనం ప్రకారం, ఇరాన్‌కు చెందిన రెండు గన్‌బోట్లు ఎలాంటి రేడియో హెచ్చరికలు జారీ చేయకుండా ఒక ట్యాంకర్‌ను సమీపించి కాల్పులకు తెగబడ్డాయి. అయితే, ఈ ఘటనలో నౌకకు గానీ, సిబ్బందికి గానీ ఎలాంటి హాని జరగలేదని, అంతా సురక్షితంగా ఉన్నారని ట్యాంకర్ మాస్టర్ నివేదించినట్లు యూకేఎంటీవో తెలిపింది. ఇదే సమయంలో, హర్మూజ్ జలసంధిపై తిరిగి తమ పూర్తిస్థాయి నియంత్రణను పునరుద్ధరించినట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికా తమ నౌకలపై

..మిగతా 2లో

వరంగల్ విమానాశ్రయానికి

# త్వరలో శంకుస్థాపన

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం విమానాశ్రయాల నిర్మాణంపై సమీక్ష

వరంగల్ విమానాశ్రయం కోసం 953 ఎకరాల భూమిని కేంద్రానికి అప్పగించినట్లు వెల్లడి

ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన




**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి, ఇతర అధికారులతో విమానాశ్రయాల ఏర్పాటుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాల

..మిగతా 2లో

రైతు భరోసా నిధులపై

# తెలంగాణ ప్రభుత్వం శుభవార్త



భూపాలపల్లి జిల్లాలో విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి

రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు విడుదల

మార్చి 22న తొలి విడత నిధులు సిద్దిపేట జిల్లాలో విడుదల చేసిన సీఎం

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెండో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం త్వరలో విడుదల

..మిగతా 2లో

# ఫోన్ ఛార్జింగ్ పెట్టి నిద్రపోయిన దంపతులు

బ్యాటరీ పేలి ఇల్లంతా మంటలు- భార్యాభర్తలు సజీవ దహనం

మొబైల్ బ్యాటరీ పేలిన ఘటనలో దంపతులు దుర్మరణం

అగ్నిమాపక సిబ్బంది సమయానికి రాలేదంటూ బంధువుల ఆరోపణలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

బిజీ లైఫ్‌లో చాలామంది రాత్రి నిద్రపోయే ముందు ఫోన్ ఛార్జింగ్ పెట్టి పడుకుంటున్నారు. ఉదయం లేచేసరికి 100 శాతం ఛార్జింగ్

..మిగతా 2లో



కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును

# తవ్వుతున్నారు

సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతోంది: కేటీఆర్

కేసీఆర్ సభకు వస్తున్నారని తెలిసి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ

కేసీఆర్ జగిత్యాల వస్తున్నారనగానే రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళుతున్నారని ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్,

..మిగతా 2లో

## 'మహిళా రిజర్వేషన్'పై డీఎంకే, కాంగ్రెస్

# విద్వేష రాజకీయాలు

మొదటి పేజీ తరువాయి...

లేదన్నారు. ఈ కుటుంబ రాజకీయ పార్టీలన్నీ అధికారం తమ కుటుంబాల పరిధిలోనే ఉండాలని కోరుకుంటున్నాయని మోదీ ఆరోపించారు. పార్లమెంటులో మహిళా కోటా బిల్లును ఎందుకు వ్యతిరేకించారో చెప్పమని డీఎంకేను నిలదీయాలని తమిళనాడు మహిళలకు ఆయన పిలుపునిచ్చారు. దీనివల్ల తమిళనాడు మహిళలకు బంగారం లాంటి అవకాశం చేజారిందన్నారు. ఇలా చేసినందుకు ఏప్రిల్ 23న (పోలింగ్ రోజున) డీఎంకే, కాంగ్రెస్‌లకు బలమైన, స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని ప్రధాని కోరారు.

**తమిళనాడుకు చాలా ఎక్కువ సీట్లు వచ్చి ఉండేవి!**

2011 జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరిగి ఉంటే తమిళనాడుకు చాలా ఎక్కువ సీట్లు వచ్చి ఉండేవని ప్రధాని తెలిపారు.



అయితే అలా జరగాలని డీఎంకే కోరుకోవడం లేదనే విషయం స్పష్టంగా తెలిసిపోతోందని ఆయన విమర్శించారు. డీఎంకే చర్యలన్నీ ఇప్పుడు అందరి ఎదుట బట్టబయలు అయ్యాయని మండిపడ్డారు. డీఎంకే పార్టీకి మహిళా సంక్షేమం కంటే రాజకీయాలే ఎక్కువై పోయాయన్నారు. 2023లో మహిళా కోటా బిల్లు ఆమోదానికి డీఎంకే మద్దతు తెలిపిందని, కానీ ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో ఆ పార్టీ యూటర్న్ తీసుకుందని పేర్కొన్నారు. నల్ల దుస్తులు ధరించడం ద్వారా తప్పుడు ఉద్దేశాలను డీఎంకే ఎంపీలు కప్పిపుచ్చలేరని మోదీ విమర్శించారు. డీఎంకే దుశ్చర్యలన్నీ తమిళనాడు ప్రజలకు తెలుసని, ఇక వారి నుంచి ఆ పార్టీ తప్పించుకోలేదన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలతో తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలుకాబోతోందని ప్రధాని తెలిపారు. ఎన్‌డీఏ ఇన్, డీఎంకే ఔట్ అనే స్పష్టమైన సందేశాన్ని తమిళ ప్రజలు ఇస్తున్నారని చెప్పారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లతో ముడిపడిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ఏప్రిల్ 17న లోక్‌సభలో ఓటింగ్ జరిగింది. దీని ఆమోదం కోసం మూడింట రెండోవంతు సభ్యుల (352 మంది) మద్దతు అవసరం. ఈ బిల్లుకు అనుకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓట్లు వేశారు. దీంతో ఆ కీలకమైన బిల్లు ఆమోదానికి నోచుకోలేదు.



## 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతు

మొదటి పేజీ తరువాయి...

సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరాగాంధీ వంటి గొప్ప నేతలు కాంగ్రెస్ పార్టీ తరపున దేశాన్ని నడిపించారని, బీజేపీ నుంచి ఇప్పటి వరకు మహిళ పార్టీ అధ్యక్షురాలు కాలేదని విమర్శించారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.



## కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్వుతున్నారు

మొదటి పేజీ తరువాయి...

హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.

రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు.

అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

## హర్మ్యూజ్ జలసంధిలో ఇరాన్ సైన్యం కాల్పులు

మొదటి పేజీ తరువాయి...

కొనసాగిస్తున్న దిగ్బంధనానికి ప్రతిస్పందనగా ఈ మూసివేత చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. అమెరికా ఆంక్షలు ఎత్తివేసేంత వరకు ఈ నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ తస్నిమ్ పేర్కొంది. ఇరాన్ కాల్పుల నేపథ్యంలో వెనక్కి మళ్లిన నౌకల్లో రెండు భారతీయ జెండా నౌకలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఒకటి 20 లక్షల బ్యారెల్స్ ఇరాక్ చమురును తరలిస్తున్న భారీ సూపర్ ట్యాంకర్ కావడం గమనార్హం. ఇరాన్ తాజా చర్యలతో హర్మ్యూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న సుమారు 10 వాణిజ్య నౌకలు తమ మార్గాలను మార్చుకుని వెనక్కి మళ్లినట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరాన్ సముద్ర ట్రాఫిక్‌ను పర్యవేక్షించే లారక్ ద్వీపం సమీపంలో ఈ నౌకలు తమ దిశను మార్చుకున్నట్లు మెరైన్ ట్రాఫిక్ డేటా సూచిస్తోంది. మధ్యప్రాచ్యంలో ఇప్పటికే నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని ఈ తాజా పరిణామాలు మరింత తీవ్రతరం చేశాయి. ఈ ఘటన ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, నౌకాదళం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయని, భారతీయ నౌకల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని అధికార వర్గాలు తెలిపాయి.

## రైతు భరోసా నిధులపై తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

మొదటి పేజీ తరువాయి...

చేయనుంది. ఈ నెల 20వ తేదీన భూపాలపల్లి జిల్లా కాటారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులను వారి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ క్రమంలో, రైతులు రెండో విడత రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.




## ప్రజలకు సేవ చేయటంలో ఎంతో సంతృప్తి

**బిజెపి నాయకులు గుడిసె యాదయ్య**

**శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో ఫ్యాన్ల పంపిణీ**

**రాజేంద్రనగర్,ఏప్రిల్18(ప్రభాత ఉదయం)**

సేవ చేయడంలోని ఆనందం మరెక్కడ దొరకదని బిజెపి రాజేంద్రనగర్ సర్కిల్ నాయకులు గుడిసె యాదయ్య అన్నారు.ఎంతకాలం బతికామన్నదీ కాదు,మనం ఏమిచేశామన్నదీ ముఖ్యమన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో రెండు ఫ్యాన్లను పంపిణీ చేశారు.అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్లు లేక చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నట్లు నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పంబాల రాజు తన దృష్టికి తేవడంతో తన వంతు సహాయంగా రెండు ఫ్యాన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జగ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దాసరి రమేష్,రాజేంద్రనగర్ అంబేద్కర్ యువజన అధ్యక్షులు గొడుగు సంజీవ,శివాజీ పొదుపు సంఘం అధ్యక్షులు శివకుమార్,అంగన్వాడి టీచర్ ఎం జ్యోతి,అంగన్వాడి సహాయకురాళ్లు సంగీత,సుశీల తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ఛార్జింగ్ పెట్టి నిద్రపోయిన దంపతులు

మొదటి పేజీ తరువాయి...

అయ్యేలా చూసుకుంటున్నారు. అయితే, అలాంటి పనుల వల్ల ప్రమాదాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. తాజాగా జరిగిన అలాంటి ప్రమాదంలో ఇద్దరు దంపతులు సజీవ దహనమయ్యారు. ఫోన్ బ్యాటరీ పేలడంతో ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించి ఆ జంట అగ్నికి ఆహుతి అయ్యారు. గుజరాత్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.

**అసలేం జరిగింది?**

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సురేంద్రనగర్ జిల్లాలోని లింబ్డీ పట్టణంలో ఉన్న 'వోరా సొసైటీ'లో సాబిర్‌భాయ్ వోరా, ఆయన భార్య రషీదాబెన్ వోరా నివసిస్తున్నారు. రాత్రి నిద్రపోయే ముందు సాబిర్‌భాయ్ తన ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టి నిద్రపోయారు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఊహించని ప్రమాదం సంభవించింది. ఛార్జింగ్ పెట్టిన ఫోన్ బ్యాటరీ వేడెక్కి ఒక్కసారిగా పేలిపోయింది.

ఆ సమయంలో ఫోన్ పక్కనే ఉన్న సోఫా, ఇతర ఫర్నిచర్‌కు మంటలు అంటుకున్నాయి. ఇంట్లో అందరూ గాఢనిద్రలో ఉండటంతో, మంటలు వ్యాపిస్తున్న విషయాన్ని ఎవరూ వెంటనే గమనించలేకపోయారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో గాలి ఆడక, మంటల నుంచి తప్పించుకోలేక సాబిర్‌భాయ్, రషీదాబెన్ దంపతులు లోపలే చిక్కుకుపోయారు.

ఇది గమనించిన వారి కుటుంబ సభ్యులు వెంటనే లింబ్డి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడాల్సిన అగ్నిమాపక సిబ్బంది, తమ వద్ద సరైన పరికరాలు లేవని, ఇతర సాంకేతిక కారణాలు చూపుతూ సకాలంలో ఘటనా స్థలానికి చేరుకోలేదని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. అనంతరం, సురేంద్రనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మరో అగ్నిమాపక సెల్‌కు సమాచారం ఇచ్చారు. వాళ్లు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారని బంధువులు తెలిపారు. కానీ, దురదుష్టవశాత్తు అప్పటికే సబిర్, రషీదాబెన్ అగ్ని ప్రమాదంలో సజీవ దహనం అయ్యారని వాపోయారు.

**రెండు గంటలైనా రాలేదు**

అయితే, ఘటన జరిగిన రెండు గంటల తర్వాత కూడా లింబ్డి అగ్నిమాపక బృందం ఘటనా స్థలానికి చేరుకోలేదని మృతుల బంధువులు ఆరోపించారు. వారి నిర్లక్ష్యం కారణంగా దంపతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లింబ్డి మున్సిపాలిటీలో అగ్నిమాపక వ్యవస్థను వెంటనే అప్డేట్ చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు అసలు కారణం తెలుసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. ఇందులో ఏదైనా నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

**నిపుణులు ఏమంటున్నారంటే!**

ఇదిలా ఉండగా, ఫోన్ ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు మొబైల్‌ను దిండ్లు, దుప్పట్లపై పెట్టొద్దని నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల వేడి బయటకు వెళ్లలేక బ్యాటరీ సెల్స్ పాడవుతాయని చెబుతున్నారు. రాత్రంతా ఫోన్ ఛార్జింగ్‌లో పెట్టడం వల్ల బ్యాటరీ సామర్థ్యం దెబ్బతినే అవకాశం కూడా ఉందంటున్నారు. నిజానికి, ఇప్పటి ఫోన్లు చాలా స్మార్ట్ అని, బ్యాటరీ 100 శాతం నిండగానే ఛార్జింగ్‌ను వాటంతట అవే ఆపేస్తాయని చెబుతున్నారు. కానీ, అసలు సమస్య 100 శాతం వద్ద ఎక్కువ సేపు ఉండటమేనని అంటున్నారు. ఫలితంగా లిథియం అయాన్ బ్యాటరీలపై ఓల్టేజ్ స్ట్రెస్ పెరిగి కాలక్రమేణా వాటి సామర్థ్యం తగ్గుతుందని చెబుతున్నారు. బ్యాటరీ లైఫ్ పెరగాలంటే 20 నుంచి 80 శాతం మధ్య ఛార్జింగ్ ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి...

నిర్మాణంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. డిఫెన్స్, సివిల్ ఏవియేషన్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో, దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.


## నల్లాకు అక్రమంగా బిగించిన మోటార్లు స్వాధీనం

**రాజేంద్రనగర్ లో మోటార్లు స్వాధీనం చేసుకున్న జలమండలి అధికారులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న మోటార్లు సీజ్ చేసారు. శనివారం రోజున రాజేందర్ నగర్ జోన్-5, ఓ అండ్ ఎం డివిజన్ నంబర్-9, హైదర్ గూడ పరిధిలోని శివ నగర్ కాలనీ, ఉప్పర పల్లిలో నల్లాకు బిగించిన మోటార్లను విజిలెన్సు అధికారులు నీటి సరఫరా సమయంలో పర్యటించి పైపులైనుకు అక్రమంగా బిగించిన 12 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ






నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.ఒకవేళ తక్కువ ప్రెజర్ తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.

## 'అరైవ్ అలైవ్'తో డ్రైవర్లలో చైతన్యం!

**మాధాపూర్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల భారీ రోడ్డు భద్రతా అవగాహన సదస్సు.. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరికేపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 18,(ప్రభాత ఉదయం)**

రోడ్డు ప్రమాద రహిత సమాజమే లక్ష్యంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా మాధాపూర్‌లోని బుట్టా కన్వెన్షన్ సెంటర్‌లో 'అరైవ్ అలైవ్ ' (సురక్షితంగా చేరుకోండి) పేరుతో నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సుమారు 600 మంది బస్సు, ఆటో డ్రైవర్లు హాజరై ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికేపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ డ్రైవర్ల చిన్నపాటి నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగులుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. చిన్న జాగ్రత్తలతో పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని డ్రైవర్లంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి ఎలా తప్పించుకోవచ్చో వివరించారు. ఓవర్ స్పీడ్ ర్యాష్ డ్రైవింగ్ ప్రాణాలకు ముప్పు అని హెచ్చరించారు. స్కూల్ బస్సు డ్రైవర్లు పిల్లల భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని



అరైవ్ అలైవ్ కార్యక్రమంలో డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే తో పాటు పోలీసు అధికారులు...

సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకం వల్ల జరిగే అనర్థాలను కళ్లకు కట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడం కంటే, కౌన్సెలింగ్ ద్వారా వారిలో మార్పు తీసుకురావడమే ఈ వినూత్న ప్రయోగం యొక్క ముఖ్య ఉద్దేశమని అధికారులు వివరించారు. భయం కంటే బాధ్యతతోనే రోడ్డు క్రమశిక్షణ సాధ్యమవుతుందని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రిథిరాజ్, ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఏడీసీపీ హనుమంతరావు, ఏసీపీలు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్, మాధాపూర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్ కుమార్, గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ సురేష్, రాయదుర్గం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ పవన్, ఆర్ఐ ప్రదీప్‌తో పాటు పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా బిల్లును అడ్డుకున్న విపక్షాల వైఖరికి నిరసన చందానగర్‌లో
# విపక్షాల దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ శ్రేణులు

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 18, (ప్రభాత ఉదయం)**

పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు ఆటంకాలు సృష్టిస్తూ కాంగ్రెస్ తోపాటు ఇండియా కూటమి అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్‌లో బీజేపీ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ నేతృత్వంలో విపక్షాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ నిన్నటి రోజును భారత మహిళా లోకానికి చీకటి రోజుగా అభివర్ణించారు. కోట్లాది మంది మహిళల దశాబ్దాల కలను సాకారం చేసే 33 శాతం రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుందని మండిపడ్డారు. మహిళా సాధికారతపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్, ఇండియా కూటమికి రాబోయే ఎన్నికల్లో మహిళలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే పారదర్శకత పెరుగుతుందని జవాబుదారీతనం వస్తుందని ఆయన పేర్కొన్నారు. గతంలో




మహిళ బిల్లును అడ్డుకున్న విపక్షాల దిష్టి బొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇందిరా గాంధీ ప్రభుత్వం తమ ఉనికి కోల్పోతామనే భయంతో డీలిమిటేషన్‌పై నిషేధం విధించిందని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అది దేశ ప్రయోజనాల కోసమేనని అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే డీలిమిటేషన్ ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. ఉత్తర దక్షిణ విభజన రాజకీయాలు ఆపాలన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ ప్రజలను రేవంత్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టడం సిగ్గుచేటన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పార్థివ దేహాన్ని పార్టీ ఆఫీసులోకి రానివ్వని సోనియా గాంధీ కుటుంబానికి మద్దతు ఇస్తున్న రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, దుర్గాప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, జితేందర్ ఎల్లేష్, రాజు శెట్టి, మహిళా నాయకులు పద్మ, సింధు రెడ్డి, కాంచన కృష్ణ, శిరీష, పార్వతి, లక్ష్మీ, అభినయ, అర్జున్, మల్లేష్ గౌడ్, గణేష్ రాజేష్ గౌడ్, వినోద్ యాదవ్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.



వేధింపులపై మహిళా ఐటి ఉద్యోగులకు అవగహన కల్పిస్తున్న షీటీమ్ అధికారులు...

# మహిళల భద్రతకు పెద్దపీట 36 మంది ఆకతాయిల అరెస్టు

**సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన**

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 18, (ప్రభాత ఉదయం)**

మహిళల రక్షణే ధ్యేయంగా సైబరాబాద్ పరిధిలో షీ టీమ్స్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ముమ్మరంగా పనిచేస్తున్నాయి. గత వారంలో చేపట్టిన చర్యల వివరాలను ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ కె. సృజన వెల్లడించారు. డెకాయ్ ఆపరేషన్లు చేసి 36 మంది పట్టుకున్నట్లు అమె వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధిస్తున్న ఆకతాయిల ఆటకట్టించేందుకు షీ టీమ్స్ సైబరాబాద్ లో 116 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన 36 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరిలో 34 మందిపై పెట్టీ కేసులు నమోదు చేయగా మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే వివిధ మార్గాల ద్వారా వచ్చిన 18 ఫిర్యాదులను షీ టీమ్స్ పరిష్కరించినట్లు డీసీపీ చెప్పారు. కుటుంబ కౌన్సెలింగ్ భార్యాభర్తల మధ్య గొడవలతో విడిపోయిన 41 కుటుంబాలను సి.డి.ఇ.డబ్ల్యూ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి కలిపారు.

**మానవ అక్రమ రవాణా నిరోధం**

ఎహెచ్ టీ యూ బృందం ఒక పిటా కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేసి, బాధితురాలిని రక్షించినట్లు అమె తెలిపారు.

**అవగాహన కార్యక్రమాలు**

మహిళలు పిల్లల హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు షీ టీమ్స్ 1,846 మందితో భారీ అవగాహన సదస్సులు నిర్వహించారు. బాల్య వివాహాలు, సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. లిఅత్యవసర సమయాల్లో డైల్ 100, 181, 1098 సైబర్ నేరాల కోసం నంబర్ 1930 ల ప్రాముఖ్యతను వివరించారు.

**ఐటీ కంపెనీల్లో భద్రతా సెషన్లు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం "గివ్ టు గెయిన్" చొరవలో భాగంగా, మాదాపూర్‌లోని సేల్స్‌ఫోర్స్, జేఎల్ఎల్ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు భద్రతా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ హనుమాన్, సబ్ ఇన్‌స్పెక్టర్ అంబికా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మహిళలు ఆపదలో ఉన్నప్పుడు ఎలా స్పందించాలి, రిపోర్టింగ్ మెకానిజం ఎలా పనిచేస్తుందనే అంశాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. సుమారు 160 ఉద్యోగులు ఈ సదస్సులో పాల్గొన్నట్లు డీసీపీ సృజన వివరించారు.

# అనుమానస్పద స్థితిలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**బుద్వేల్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):**



వెంకటేష్

అనుమానస్పద స్థితిలో ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం మద్నాహ్నం అత్తాపూర్ సర్కిల్ హైదరూడ లో జరిగింది. అతని మరణానికి కారణాలు తెలియరాలేదు. రాజేంద్రనగర్ ఏఎస్ఐ పాండు తెలిపిన వివరాలు ఈ విదం గా ఉన్నాయి... హైదర్ గూడ కు చెందిన శ్రీనివాస్ కుమారుడు వెంకటేశ్ (29) సాఫ్ట్వేర్ ఉద్యోగి గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆయన కు కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. శనివారం ఉదయం ఇంట్లో టిఫిన్ చేసి పై అంతస్థులో పడుకుంటానని వెళ్లాడు. మధ్యాహ్నం రెండు గంటలు కావస్తున్నా కొడుకు తినడానికి క్రిందకు రాకపోవడంతో తండ్రి శ్రీనివాస్ పై అంతస్థుకు వెళ్లాడు. వెం కటేశ్ పడుకున్న గదికి లోపలి నుంచి గడియ పెట్టుకుని ఉన్నాడు. పక్కింటి వారిని పిలిచి తలుపు తట్టడంతో గడియ విరిగిపోయింది. శ్రీనివాస్ లోపలికి వెళ్లి చూడగా కొడుకు వెంకటేశ్ సీలింగ్ హుక్ కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లబోదిబో మన్న తండ్రి శ్రీనివాస్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. తమ కుమారునికి ఎలాంటి ఇబ్బందులు లేవని తండ్రి శ్రీనివాస్ తెలిపాడు. కేసు ను ఎఎస్ఐ పాండు దర్యాప్తు చేస్తున్నారు.



# హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రిక విడుదల

**రాజేంద్రనగర్,ఏప్రిల్18(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ హిందూ సమ్మేళన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న హిందూ సమ్మేళనంకు సంబంధించిన ఆహ్వాన పత్రిక విడుదల కార్యక్రమం స్థానిక శ్రీరాంబాగ్ సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో జరిగింది.ఆహ్వాన పత్రికలను ముందుగా శ్రీసీతా రామచంద్రస్వామి వారి పాదాల వద్ద ఉంచి వేద మంత్రాలతో పూజ చేసిన తరువాత సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇప్పటి వరకు ఇలాంటి కార్యక్రమం ఎప్పుడూ జరగలేదు కావున అందరం కలసి కులాలకు రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతంగా జరపాలని అందరిని కోరారు.ఈ సందర్భంగా సమితి సభ్యులు,పుర ప్రముఖులు హిందూ బంధువులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయండి

**ఏఐటీయూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య**

**నాలుగు లేబర్ కోడులను రద్దు చేసేవరకు పోరాడుదాం..**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**

**రాజేంద్రనగర్,ఏప్రిల్18(ప్రభాత ఉదయం)**

నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగించాలని,అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య తెలిపారు.ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం శంషాబాద్ పట్టణంలోని కార్యాలయంలో కే.రామస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో చంద్రయ్య పాల్గొని మాట్లాడారు.కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు కార్మిక వర్గం పోరాటాలు నిర్వహించాలని కార్మిక వర్గానికి చంద్రయ్య పిలుపునిచ్చారు.రంగారెడ్డి జిల్లాలో లక్షలాది మంది కార్మికులు ఉన్నారని వారందరి తరపున ఏఐటీయూసీ పోరాడాలని ఆయన తెలిపారు.ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ...కార్మికులకు ఉద్యోగులకు కనీస వేతనాలు రూ.26 వేలు,అన్ని రంగాల కార్మికులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆయన వాపోయారు.కాంట్రాక్టర్లు కార్మికులపై పెత్తనం చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు.అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను నాలుగు లేబర్ కోడుల రద్దు చేసే పోరాట కేంద్రంగా కార్మిక వర్గం మేడేను నిర్వహించాలని పర్వతాలు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కే.రామస్వామి,జిల్లా ఉపప్రధాన కార్యదర్శి దత్తునాయక్,జిల్లా కార్యదర్శులు ఎస్.మల్లేష్,వనంపల్లి జైపాల్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు టి.నరసింహారెడ్డి,రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు నర్రాగిరి,సక్రు నాయక్,కే.రాజు,బాబురావు,ప్రభాకర్,శివయ్య,రామచంద్రయ్య,జిల్లా సమితి సభ్యులు ఖాజా పాషా,శంషాబాద్ మండలం ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ (బీసీ) మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి

**బుద్వేల్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**



పసి బిడ్డ తో డిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపడుతున్న డాక్టర్ సల్లా సౌజన్య

మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ(బీసీ) మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో అసిస్టెం ట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ఎన్ఎస్ ఈయుఐ మాజీ జాతీయ కార్యదర్శి, విద్యావేత్త, సామాజిక కార్యకర్త డాక్టర్ నల్లా సౌజన్య శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తన రెండు నెలల పాప తో నిరసన కు దిగింది. ఈ విషయాన్ని ఆమె శనివారం వివరించింది. తన రెండు నెలల పసికందు తో నిరసన లో పాల్గొనడం ప్రస్తుత పరిస్థితుల తీవ్రత ను స్పష్టంగా చూపిస్తోంది. ఒక తల్లి, ఒక విద్యావేత్త, ఒక నాయకురాలు తన కుటుంబ బాధ్యతల మధ్యలో కూడా సమాజ న్యాయం కోసం వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడటం అత్యంత విచారకరమన్నారు. మహిళా బిల్లును దేశ వ్యాప్తంగా స్వాగతించినప్పటికి అందులో బీసీ, ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడం సమానత్వ సూత్రాలకు విరుద్ధంగా ఉం దన్నారు. అందరు మహిళలు సమానం అనే భావనను అమలు చేయాలంటే సామాజిక, ఆర్థికంగా వె నుకబడిన వర్గాల మహిళలకు కూడా సరైన ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరం అన్నారు. నా పోరాటం వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదని, ఇది సామాజిక న్యాయం, సమాన హక్కులు, సమగ్ర ప్రాతినిధ్యం కోసం జరుగుతున్న ఉద్యమం అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బీసీ మహిళల ఆవేధనను గమనించి మహిళ రిజర్వేషన్ బిల్లులో తగిన మార్పులు చేసి అన్ని వర్గాల మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కోర్టు దిక్కరణ క్రింద రాజేంద్రనగర్ ఆర్డీవో కె వెంకట్ రెడ్డి కి నెల రోజుల జైలు శిక్ష, రూ. 2వేల జరిమాన

**పెద్ద షాపూర్ లోని 74 ఎకరాల భూమి సీలింగ్ భూమి అంటున్న అధికారులు**

**అప్పీల్ కు వెళ్లే ఆలోచన లో అధికారులు**

**బుద్వేల్ ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**



కె వెంకట్ రెడ్డి


రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకట్రెడ్డికి హై కోర్టు దిక్కరణ క్రింద నెల రోజుల జైలు శిక్ష, రూ 2వేలు జరిమాన విధించింది. అప్పిల్ కు వెళ్లడానికి రెండు వారాలు గడువు ఇచ్చింది. ఈ విషయం శనివారం వాట్సాప్ గ్రూపులలో చక్కర్లు కొట్టింది. దీనిపై ఆర్డీవో వెంకట్ రెడ్డి ని వాట్సాప్ ద్వారా సంప్రదించగా ఇది సాదారణమే... ప్రభుత్వ భూములను కా పాడాలంటే తప్పదు అని సమాధానం ఇచ్చారు. వివరాలలోకి వెళితే... శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ లోని 74.97 ఎకరాల భూమి వివాదంలో ఉంది. ఆ భూమికి యజమాని నగరానికి చెందిన నవాబ్ మహ్మద్ యూసుపుద్దీన్ ఖాన్ అని హై కోర్టు గతంలో తీర్పు ఇచ్చినట్లు తెలుస్తుంది. అయితే సదరు భూమి సీలింగ్ భూమి కావడంతో అది ప్రభుత్వ భూమి అని రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో కేసు నడుస్తుంది. సీలింగ్ భూమి అని అది ప్రభుత్వానిదని ఆర్డీవో సూచించారు. హై కోర్టు పెద్ద షాపూర్ లో ఉన్న 74.97 ఎకరాలు మా భూమి అని మా పేరున రికార్డుల్లో ఎక్కించాలని చెప్పినప్పటికి ఆర్డీవో వినిపించుకోవడం లేదని కోర్టు దిక్కరణ చేశారంటు తిరిగి హై కోర్టును ఆశ్రయించాడు. దీనిపై కోర్టు ఆర్డీవో కు నెల రోజుల శిక్ష, రూ.2వేల జరిమాన విదిస్తు ఉత్తర్వులు జారీ చేసింది. అప్పీలుకు రెండు వారాలు గడువు ఇవ్వడంతో సదరు భూమి ప్రభుత్వ సీలింగ్ భూమి అని పేర్కొంటు ఆర్డీవో వెంకట్ రెడ్డి అప్పీల్ కు వెళ్లే ఆలోచన లో ఉన్నట్లు తెలుస్తుంది.



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

# ఆక్రమణల తొలగింపు

**బుద్వేల్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):**



అత్తాపూర్ నుంచి శివరాంపల్లి వరకు పుట్పాత్ ఆక్రమణలను శనివారం రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు దగ్గరుండి తొలగించారు. ఎన్ని సార్లు చెప్పినా పుట్ పాత్ లను ఆక్రమించి వేసిన షెడ్లను డబ్బాలను తొలగించడం లేదని, అందుకే గ్రేటర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేయడం జరిగిందని డిప్యూటీ కమిషనర్ లు బి సురేం దర్ రెడ్డి , మల్లారెడ్డి లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ లు శ్రీధర్, సుధాకర్ ల ఆధ్వర్యంలో ఈ కూల్చివేత బిలు కొనసాగాయి. అత్తాపూర్, రాజేంద్రనగర్ పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేత్తలు కొనసాగాయి. అధికారులు మాట్లాడుతూ, పుట్పాత్లపై అక్రమణలు చేపట్టవద్దన్నారు. పార్కులు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఇలా ఎక్కడ ఆక్రమణలు చేపట్టిన వాటిని తొలగించడం జరుగుందని తెలిపారు.

# ప్రాణాలను కాపాడే 'గోల్డెన్ అవర్' సేవలు హోలిస్టిక్ హాస్పిటల్స్ కీలక ముందడుగు

**24x7 గుండెనొప్పి, పక్షవాతం అత్యవసర హాట్‌లైన్ ప్రారంభం**

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 18, (ప్రభాత ఉదయం)**

అత్యవసర వైద్య పరిస్థితుల్లో కాలంతో పోటీ పడి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కొండాపూర్‌లోని హోలిస్టిక్ హాస్పిటల్స్ రెడ్ అంబులెన్స్' సంస్థతో కలిసి సరికొత్త విప్లవాత్మక సేవలకు శ్రీకారం చుట్టింది. 24x7 అందుబాటులో ఉండే ప్రత్యేక అత్యవసర అంబులెన్స్ సేవలతో పాటు, గుండెనొప్పి పక్షవాతం (స్ట్రోక్) బాధితుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఆసుపత్రి ప్రాంగణంలో ప్రారభించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, తెలంగాణ జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా,108 సేవల దేశంలోని వివిధ రాష్ట్రాలకు పరిచయం చేసిన అధినేత భారత బీమా సమాచార బ్యూరో సీఈఓ వెంకట్ చంగవల్లి పాల్గొన్ని ప్రారభించారు. ముఖ్య అతిధులు మాట్లాడుతూ ఛెస్ట్ పెయిన్ స్ట్రోక్ హాట్‌లైన్ (888 6666 108) నంబర్ ద్వారా రోగులు లేదా వారి సహాయకులు తక్షణమే



హోలిస్టిక్ హాస్పెటల్ లో అత్యవసర సేవలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్య అతిధులు.

వీడియో కాల్ ద్వారా నిపుణులైన వైద్యులతో సంప్రదింపులు జరపొచ్చన్నారు. ఆసుపత్రికి చేరకముందే నిపుణుల తక్షణ వైద్య సలహాలు ముందస్తుగా ప్రాణాపాయ ముప్పును గుర్తించడం జరుగుతుందని వక్తాలు వివరించారు. అంబులెన్స్‌లోనే ప్రాథమిక చికిత్సపై మార్గదర్శకాలు చేయడం జరుగుతుందని తెలిపారు. గుండెపోటు లేదా పక్షవాతం సంభవించినప్పుడు ప్రతి సెకను ఎంతో విలువైనది. సకాలంలో స్పందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించడమే కాకుండా, పక్షవాతం వంటి దీర్ఘకాలిక దుష్ప్రభావాల నుంచి రోగిని కాపాడవచ్చు అని చెప్పారు. డాక్టర్ శ్రవణ్, డాక్టర్ నీలేష్, న్యూరాలజిస్ట్ డాక్టర్ మనోజ్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ మైత్రి పేర్కొన్నారు.

**అందుబాటులో సాయంత్రం, ఆదివారం క్లినిక్‌లు**

బిజీ జీవనశైలి కలిగిన వారి కోసం ఆసుపత్రి యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో ఆదివారాల్లో కూడా ప్రత్యేక క్లినిక్‌లు అందుబాటులో ఉంటాయని, తద్వారా సామాన్యులకు నాణ్యమైన వైద్యం మరింత చేరువవుతుందని ప్రకటించారు.

**యాజమాన్యం నిబద్ధత**

హోలిస్టిక్ హాస్పిటల్స్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎస్. రామచంద్ర, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తుషార ఆలూరి మాట్లాడుతూ సాంకేతికతను జోడించి రోగులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి క్షణం ఎంతో విలువైనది అనే నినాదంతో అత్యవసర సేవలలో కొత్త ఒరవడిని సృష్టిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

### గ్రామస్తులు కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి.

### లైఫ్లీ హుడ్ ఇంక్లూజివ్ ప్రోగ్రాం కు గట్టు మండలం ఎంపిక.

### ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**





ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.గట్టు మండలం చమన్ ఖాన్ దొడ్డి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న పలువురు లబ్ధిదారుల నూతన గృహాలను రిబ్బన్ కట్ చేసి ముఖ్య అతిథులు ప్రారంభించారు. గృహప్రవేశాలు చేసుకున్న ఇండ్ల యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వేదిక వద్ద పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఒకేసారి పెద్ద ఎత్తున గృహప్రవేశాలు చేసుకోవడం సంతోషంగా ఉందని, మరో విడతలో ఇండ్లు లేని వారికి కూడా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి ముందు మరుగుదొడ్లను నిర్మించుకొని, వినియోగించుకుంటున్నందుకు అభినందనలు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. తెలంగాణ లైఫ్లీ హుడ్ ఇంక్లూజివ్ ప్రోగ్రాంకు గట్టు మండలం ఎంపికవడంతో అత్యంత వెనుకబడ్డ 15 గ్రామాలను ఎంపిక చేసి, ఒక్కో గ్రామంలో 25 కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు సమన్వయకర్తల సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. షుగర్, బీపీ వ్యాధులు పెరుగుతున్నాయని ప్రజలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్తులు తమ పిల్లలను చక్కగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తోడ్పడాలని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల సేవలను చిన్నారులు, గర్భిణీ, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న వారు సొంతింటి కలను సాకారం చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. వెనకబడ్డ ఈ గ్రామంలో ఒకప్పుడు తాటాకు గుడిసెలు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లతో పక్కా గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. బ్రతుకుతెరువు కోసం వలస పోయే పరిస్థితులను రూపుమాపి ప్రజలు సొంతంగా తమ కాళ్లపై నిలబడేలా ప్రభుత్వం అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్తులు ఐక్యమత్యంగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అభిలషించారు. అంతకు ముందు సిఎస్ఆర్సి కార్యక్రమంలో భాగంగా ఎల్టీఎం, భవిష్య భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన డిజిటల్ సేవల భవనాన్ని ముఖ్య అతిథులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, గ్రామ సర్పంచ్ భీమయ్య, ఉప సర్పంచ్ రేణుక, హౌసింగ్ డిఈ కాశీనాథ్, తహసిల్దారు విజయ్ కుమార్, ఎంపీడీవో చెన్నయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్నమునిసిపల్ ఛైర్పర్సన్ జయలక్ష్మి నర్సింహులు యాదవ్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

# వేసవిలో చలివేంద్రాలు ఎంతో దోహదం

### ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

### రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన చలివేంద్రం ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**

వేసవిలో ప్రజలకు చలివేంద్రాలు ఎంతో దాహార్తిని తీరుస్తాయని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని టి.టి డి కళ్యాణ మండపం సమీపంలో రెడ్డి సేవా సమితి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మునిసిపల్ ఛైర్పర్సన్ జయలక్ష్మి నర్సింహులు యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కి రెడ్డి సేవా సమితి సంఘం నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు నీళ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్పర్సన్ జయలక్ష్మి నర్సింహులు యాదవ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుర్వ నల్ల హనుమంతు, మాజీ చైర్మన్లు గట్టు తిమ్మప్ప, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంధాలయం మాది చైర్మన్ జంబూ రామన్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణ రెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మెన్ శ్రీధర్ గౌడ్, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్స్ మాజీ కౌన్సిలర్స్, రెడ్డి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## నాచారంలో ప్రమాదం.. సకాలంలో స్పందించిన జలమండలి

**హైదరాబాద్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**

శనివారం నాచారం పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమలో అగ్నిప్రమాదం సంభవించిందని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కి వచ్చిన సమాచారాన్ని వాళు ్ర.. జలమండలి స్థానిక కార్యాలయానికి వాటర్ ట్యాంకర్ల కోసం సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి స్థానిక జీఎంను అప్రమత్తం చెయ్యడంతో 12 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం మంటలు అందులోకి వచ్చాయని, ఘటన స్థలంలో జలమండలి అధికారులు, పోలీస్, ఫైర్ అధికారులు పరిస్థితులను సమీక్షిస్తున్నారు.సకాలంలో స్పందించిన జీఎం, మేనేజర్లను జలమండలి సిబ్బంది, అధికారులను ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు.







## టి జి ఈ జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై నిరసన

**హైదరాబాద్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు ఆయా కార్యాలయాలలో భోజన విరామ సమయంలో తమ డిమాండ్లను ప్రభుత్వానికి వివరించారు.

**ఉద్యోగులప్రధాన డిమాండ్లు**

51% ఫిట్మెంట్తో పి.ఆర్.సి వెంటనే ప్రకటించాలి, ఉద్యోగుల హెల్త్ స్కీమ్ను తక్షణమే అమలు చేయాలి, పెండింగ్ బిల్లులను ఒకేసారి విడుదల చేయాలి, సి.పి.ఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి,సెక్రటేరియట్లోహ12.5% కోటాను అమలు చేయాలి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి, డిమాండ్ల సాధన కోసంఉ ద్యోగులు, గెజిటెడ్ అధికారులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సి.పి.ఎస్ ఉద్యోగులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.టి జి ఈ జెఎసి నగర విభాగం చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, కన్వీనర్ గందూరి వెంకటేశ్వర్లు, ఎం ఏ నయీం తదితరులు పాల్గొన్నారు.





## ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ గురుకుల కళాశాల

### ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించి ర్యాంకులు పొందిన పద్మశాలి ఆణిముత్యాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

ప్రైవేటు కళాశాలకు దీటుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల కళాశాలల విద్యార్థులు ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో జిల్లాస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణం. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని చేనేత వస్త్రాలు తయారు చేయడమే కాక వారి పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దడానికి గురుకుల కళాశాలలో వదిలి వారి అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న చేనేత కార్మిక తల్లిదండ్రులకు కృతజ్ఞతలు. గద్వాల పట్టణానికి చెందిన1.జద్రం దీక్షిత తండ్రి నాగరాజు 992 బైపిసి బాలానగర్ గురుకుల జూనియర్ కళాశాల,2. ఏటి చరణ్ తండ్రి రమేష్ 990 యాదాద్రి భువనగిరి, సర్వేల్ గురుకుల జూనియర్ కళాశాల,3.సాక శివ శశాంక్ తండ్రి వెంకటేష్ 979 ఎంపీసీ యాదాద్రి భువనగిరి సర్వేల్ గురుకుల జూనియర్ కళాశాల . 4. పులిపాటి స్ఫూర్తి తండ్రి పులిపాటి రాఘవేందర్ 979 పీుజ బాలనగర్ గురుకుల కళాశాల.5.బొడుగుల అనుష్ తండ్రి జగదీష్ 973 మార్కులు సాధించి తల్లిదండ్రులకే కాక కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చారు. వీరే కాక ఇంకా చాలామంది పద్మశాలి ముద్దుబిడ్డలు ఇంటర్మీడియట్ తో పాటు ఉన్నత చదువులు చదివి గద్వాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పద్మశాలి కుల బాంధవులు కోరుతున్నారు.

## 20 నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

### కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'వెల్ఫేర్ వీక్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరుపై ఆయన శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్ను వివరించారు జిల్లా కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు. ప్రజాప్రతినిధు లను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, సిహెచ్. ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

# సెన్సస్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### సెన్సస్ ఎన్నికలతో సమానమైన ప్రాముఖ్యత గలది.... సెన్సస్ సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**



సెన్సస్ ప్రక్రియ ఎన్నికలతో సమానమైన ప్రాముఖ్యత కలిగి ఉందని, ఇది కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యక్రమమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం మల్దకల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ లో గణనకు సంబంధించి సూపర్వైజర్లు, ఎన్నుమరేటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెన్సస్ విధులు నిర్వహించే వారందరూ బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. సెన్సస్లో సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఇండ్ల గణనకు సంబంధించి తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఇండ్ల గణన పూర్తయితే వచ్చే ఏడాది జనాభా గణన చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన బ్లాక్పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, మ్యాప్ తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సరైన మ్యాప్ ఉంటే సగం పని పూర్తయినట్లేనని తెలిపారు. ఇళ్ల లెక్కింపు (హౌస్ లిస్టింగ్) అత్యంత జాగ్రత్తగా చేయాలని, ఒక్క తప్పు కూడా ఉండ కూడదన్నారు.సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియను ఎక్కువగా ప్రోత్సహించాలని, ఈ విషయాన్ని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆశ, అంగన్వాడి కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు జరిగే ఇండ్ల గణన ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్ల పనిని చార్జ్ అధికారులు సమీక్షిస్తూ, మార్గనిర్దేశం చేయాలని, ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించాలన్నారు. సెన్సస్ హ్యాండ్బుక్ మరియు గైడ్లైన్స్ ప్రకారం పనులు నిర్వహించాలని ఆదేశించారు. గణనకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే శిక్షకులను అడిగి ఇప్పుడే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలనతో, పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేస్తే సెన్సస్ విజయవంతంగా పూర్తి చేయవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మల్దకల్ మండల తహసిల్దార్ ఝాన్సీ, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంఈఓ సురేష్, శిక్షకులు నరేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కృషి

## లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాడు

**హైదరాబాద్(రాజేంద్రనగర్) ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**




సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాడు తెలిపారు. రాజేంద్రనగర్ దగ్గర ఆరామ్‌ఘర్‌లో ఉన్న బికనేర్‌వాలా బొటిక్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఘు ఉద్యోగ భారతి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. 28 రాష్ట్రాల్లో 75 వేల మందికి పైగా సభ్యులతో దేశంలోనే అతిపెద్ద సంఘంగా నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సన్నిహితంగా పని చేస్తూ ఎంఎస్ఎంఈ విధానాల రూపకల్పన, అమలులో విలువైన సూచనలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు కూడా మా సూచనలను కోరుకుంటున్నాయన్నారు. తెలంగాణ శాఖ దేశంలోనే అత్యంత చురుకైన శాఖలలో ఒకటిగా ఉ ందన్నారు. ఎంఎస్ఎంఈ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతోందని చెప్పారు. దేశవ్యాప్తంగా సభ్యులు పరస్పరం కలిసేలా, వ్యాపార అవకాశాలు పెంపొందించుకునేలా లఘు ఉద్యోగ భారతి ఒక బలమైన డిజిటల్ వేదికను అందిస్తుందని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా మన్నారు. విద్యా సంస్థలు, ఐఐటీలు, పరిశోధన, మేనేజ్‌మెంట్ సంస్థల భాగస్వామ్యంతో సభ్యులు సామర్థ్యాన్ని పెంచుకుంటున్నారని తెలిపారు. సీఎస్ఐఆర్ తో నిర్వహించిన '100 రోజులు – 100 టెక్నాలజీలు' కార్యక్రమం ద్వారా సభ్యులు వినూత్న సాంకేతిక పరిష్కారాలతో లాభపడుతున్నారని తెలిపారు. తెలంగాణకు చెందిన ఇద్దరు సభ్యులు ఈ సాంకేతికతతో ప్రయోజనం పొందారన్నారు. అదనంగా 100కు పైగా ఐటీఐలతో భాగస్వామ్యం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను రూపుదిద్దుతున్నామన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేసి, ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణలో 13 జిల్లాల్లో విస్తరణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఎంఎస్ఎంఈల వాణిని మరింత బలంగా వినిపించడమే లక్ష్యమన్నారు. పరిశ్రమల సమస్యలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామన్నారు. మా కృషితో ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన లభిస్తుందన్నారు. విధానాలు, జీఓలకు సంబంధించిన ముఖ్య సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. నైపుణ్య లోటును అధిగమించేందుకు ఐటీఐ ప్రిన్సిపాళ్లతో చర్చలు ప్రారంభించామన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో మార్పులకు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో కుదిరిన ఎంఓయూ ద్వారా ఇప్పటికే సుమారు 200 మంది విద్యార్థులకు ఉపాధి కల్పించగలిగామన్నారు. ఇన్నోవేషన్, పరిశ్రమల మధ్య గ్యాప్‌ను తగ్గించేందుకు, ఐఐసీటీ వద్ద ఉన్న 2,600కు పైగా సిద్ధంగా ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే నరేంద్రనాథ్ దత్ మాట్లాడుతూ... లఘు ఉద్యోగ భారతి ఎంఎస్ఎంఈల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. తెలంగాణలో 600 మంది సభ్యులు ఉన్నారన్నారు. మా నినాదం 'మేడ్ ఇన్ ఇండియా – మేడ్ ఫర్ ది వరల్డ్' అన్నారు. ఈ సమావేశంలో లఘు ఉద్యోగ భారతి అఖిల భారత సంయుక్త ప్రధాన కార్యదర్శి మోహన్ సుందరం, అఖిల భారత ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బీ అనిల్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కోశాధికారి ఓం అనుజ్ ఖేరండేవాల్ పాల్గొన్నారు.లఘు ఉద్యోగ భారతి ఒక జాతీయ స్థాయి సంస్థ. దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి, బలోపేతం కోసం పని చేస్తుంది. ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని సాధించడం, ఉపాధి అవకాశాలు పెంచే పారిశ్రామిక వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా ముందుకు సాగుతుంది. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న చిన్న, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి, స్థిరత్వాన్ని ప్రోత్సహించడం ధ్యేయంగా ఉంది. దేశీయ ఉ త్పత్తిని ప్రోత్సహిస్తూ, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. యువత, నిపుణులను ఉద్యోగార్థులుగా కాకుండా, ఉద్యోగ సృష్టికర్తలుగా మారేందుకు ప్రేరేపిస్తుంది. ఎంఎస్ఎంఈల సమస్యలను ప్రభుత్వానికి వినిపిస్తుంది. పరిశ్రమలకు అనుకూలమైన విధానాల రూపకల్పనకు సహకరిస్తుంది. చిన్న పరిశ్రమల్లో ఆధునికీకరణ, ఆవిష్కరణలు, కొత్త సాంకేతికతలను స్వీకరించేందుకు ప్రోత్సహిస్తుంది. ఎంఎస్ఎంఈల మధ్య పరస్పర అనుసంధానం, సహకారం పెంపొందించే బలమైన వేదికను సృష్టిస్తుంది. సెమినార్లు, వర్క్‌షాప్‌లు, వ్యాపార సమావేశాలు నిర్వహిస్తూ.. జ్ఞానం, వ్యాపార అవకాశాలను పంచుకుంటుంది. వ్యవసాయ పారిశ్రామిక, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మీద శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఎంఎస్ఎంఈల సంక్షేమం కోసం ప్రభుత్వ విభాగాలతో చర్చలు జరుపుతుంది. సూచనలు ఇస్తుంది. ఉ త్పాదకత, పోటీ సామర్థ్యాన్ని పెంచేందుకు పరిశ్రమ క్లస్టర్ల అభివృద్ధికి మద్దతు ఇస్తుంది. ఎగ్జిబిషన్లు, కొనుగోలుదారులు – అమ్మకందారుల సమావేశాల ద్వారా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించేందుకు ఎంఎస్ఎంఈలకు సహాయం చేస్తుంది. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, నిధుల అవకాశాలపై సభ్యులకు అవగాహన కల్పిస్తుంది. గ్రామీణ స్థాయిలో వ్యాపారాన్ని ప్రోత్సహిస్తూ, గ్రామ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

# డబ్బు ఉంటేనే దైవ దర్శనం - లేదంటే దూషణలు

## ఆవేదన చెందుతున్న భక్తులు

**గద్వాల జిల్లా ప్రతినిధి ( కేటి దొడ్డి), ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**



కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వివాదాలకు నిలయంగా మారింది. సుదూర ప్రాంతాల నుండి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడానికి వస్తున్న భక్తులకు పూజారుల నుండి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఆలయంలో దాసంగాలు, గండ దీపాలు, మరియు ప్రత్యేక పూజల పేరుతో పూజారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.రూ. 500 నుండి రూ. 1000 వరకు సమర్పించే భక్తులకు మర్యాదపూర్వక స్వాగతం పలుకుతూ, వారికి ప్రత్యేక గౌరవం ఇస్తున్నారని, డబ్బులు ఇవ్వలేని సామాన్య భక్తుల పట్ల పూజారులు అత్యంత దారుణంగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తి మార్గంలో నడవాల్సిన పూజారులు, పవిత్రమైన ఆలయ ప్రాంగణంలోనే ఈ విధంగా ప్రవర్తించడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఇదేక్కడి న్యాయం?" అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆలయ గౌరవాన్ని అప్రతిష్టపాలు చేస్తున్న పూజారులపై దేవాదాయ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు. దీనిపై ఆలయ ఈఓ పురేందర్ కుమార్ ను వివరణ కోరగా కానుకలు సమర్పించని భక్తులపై దాడులు దిగిన పూజారులపై చర్యలు తీసుకుంటామన్నారు

# బిజెపి నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

## మహిళా బిల్లు వ్యతిరేకించిన ప్రతిపక్షాల కు ప్రజలు బుద్ధి చెప్పాలి: బిజెపి జిల్లా మహిళా మోర్చ్ కార్యదర్శి మేకల వనితారెడ్డి

## బిజెపి నాయకులు, నాయకురాళ్లను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలింపు



జూబ్లీహిల్స్ పోలీసుల అదుపులో బిజెపి మహిళా మోర్చా నాయకులు, నాయకురాళ్ళు



**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం మహిళ రిజర్వేషన్ పెట్టిన సందర్భంగా ప్రతిపక్షాలు మద్దతు తెలుపక పోవటంతో దేశవ్యాప్తంగా బిజెపి నిరసన వ్యక్తం చేసింది. శనివారం అందులో భాగంగా బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి, బిజెపి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిరా రెడ్డి లతోపాటు బిజెపి నాయకులు, నాయకురాలు సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడి చేయడానికి వెళుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన బిజెపి నాయకులు, నాయకురాళ్లను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనితారెడ్డి, బిజెపి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిరా రెడ్డి ఇల్లు మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ కు ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వకపోవడం పట్ల తీవ్రంగా మండిపడ్డారు. దేశంలోని మహిళలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీ తో పాటు ఇండియా కూటమికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో నగర బిజెపి నాయకులు, నాయకురాళ్లు ఉన్నారు.



# సంఘం పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తే బహిష్కరణ ఖాయం!

## సంఘాన్ని వాడుకుంటే ఊరుకోం...

## టిడిఎస్ఎస్ ఘాటు స్పందన

**కూకట్ పల్లి, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ దళిత సంక్షేమ సంఘం పేరును దుర్వినియోగం చేస్తూ, తాను వ్యవస్థాపక అధ్యక్షుడినని ప్రకటించుకున్న ఆదిముల్ల రాము ప్రచారం పూర్తిగా అసత్యమని టిడిఎస్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం బాలానగర్ రాజుకాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో సంఘం నాయకత్వం ఏకగ్రీవంగా ఈ అబద్ధపు ప్రచారాన్ని ఖండిస్తూ, ఇది కేవలం వ్యక్తిగత ప్రచారం కోసం చేసిన కుట్రగా పేర్కొంది. సంఘం ముఖ్య సలహాదారుడు నల్లా విల్సన్ మాట్లాడుతూ, సంఘం స్థాపనలో నిజంగా కృషి చేసిన వారిని పక్కనబెట్టి, ఎప్పుడూ కనిపించని వ్యక్తి ఒక్కసారిగా వ్యవస్థాపకుడినని చెప్పుకోవడం దురుద్దేశపూరిత చర్యయని మండిపడ్డారు. సలహాదారులు మల్లిగారి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు కలమూరి శ్రీనివాస్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహంకాళి శివశంకర్ తదితరులు మాట్లాడుతూ ఇది సంఘాన్ని దెబ్బతీయడానికి పన్నిన పథకం తప్ప మరేమీ కాదని స్పష్టం చేశారు. ఈ నెల 14న శోభనా బస్ స్టాప్ వద్ద జరిగిన డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఉదాహరణగా చూపుతూ, అసలు కార్యక్రమం నిర్వహణలో శ్రమించిన నాయకులను పక్కన పెట్టి, కొందరు వ్యతిరేక వర్గాలు ముందే వచ్చి ఎమ్మెల్యేతో కలిసి కార్యక్రమాన్ని తమదిగా చూపించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటనను ఉపయోగించుకుని ఆదిముల్ల రాము తాను వ్యవస్థాపకుడినని ప్రచారం చేసుకోవడం సంఘాన్ని అవమానపరచడమేనని మండిపడ్డారు. సంఘం ఏర్పాటైన ప్రారంభ దశలో అడాక్ కమిటీలోనూ లేని వ్యక్తి, ఇప్పుడు వ్యవస్థాపకుడిగా చెప్పుకోవడం ఎంత వరకు సమంజసం? అని నాయకులు ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక స్పష్టమైన కుట్ర ఉందని, సంఘం ప్రతిష్టను దెబ్బతీయడానికి కొన్ని శక్తులు కదిలిపోతున్నాయని తీవ్రంగా విమర్శించారు.ఇకపై సంఘం పేరుతో సంఘానికి వ్యతిరేకంగా లేదా చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా ఎవరైనా వ్యవహరించినా, ఎలాంటి నోటీసులు లేకుండా, ఎలాంటి సంజాయిషులు అడగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఆదిముల్ల రామును సంఘం నుండి మాత్రమే కాకుండా, ప్రాథమిక సభ్యత్వం నుండి కూడా బేషరతుగా బహిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సంఘం అనేది వ్యక్తులది కాదనీ, ఆశయాలదని దానిని వ్యక్తిగత ప్రచారం కోసం వాడుకునే ప్రయత్నం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించంబోమని వారు హెచ్చరించారు.



# మోడీ తల వంచితే దేశం తలవంచదు

## అమెరికా ట్రేడ్ డీల్ ఒప్పందాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

## భారీ ఎత్తున బైక్రాలితో ధర్నా చౌక్ కి బయలుదేరిన కాంగ్రెస్ యూత్ నాయకులు

## జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం)**

మోడీ తల వంచితే దేశం తలవంచదు అనే నినాదంతో, అమెరికా ట్రేడ్ డీల్ ఒప్పందాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్ మేరకు శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులందరూ ఏకమై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి సలీం ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీతో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బయలుదేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకుడు ఎండి మోయిజ్, రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608